# తప్పెవరిది



శ్రీమతి రాజహంస

" నేనేమిటి చేసేనూ "

"................"

" ఎందుకూ నామీద కోపం "

"................"

" నావల్ల పొరపాటేమిటో చెప్పకూడదూ"

"........ ........"

" మళ్లా మొఘం తిప్పేసుకుంటే నేనేమిటి చేస్తాను. నామాటవినే వినిపించుకోరు కదా, ఎలాగ "

"................"

" నన్ను క్షమించండి తప్పంటే "

" తప్పంటే ఏమిటి! తప్పు చెయ్యలేదంటావా ?"

"................"

" నీవల్ల తప్పులేదా !"

"................"

" ఏం మాటాడవేమి "

"................"

" అలా మొద్దులా. వూరుకుంటావేమి ?"

" క్షమించ మన్నాను కదూ "

" నీ తప్పు ఒప్పుకున్నావా "

" ఔను నాది తప్పేనూ "

" ఏమిటి "

"................"

నిజం చెప్పవలసి మాటుంటే నావల్ల తప్పేమిటో నాకు తెలీదు. మామూలుగానే సాయంత్రం ఐదున్నరకి ఆఫీసునుంచి వచ్చేరు. కుర్చీలో పడుక్కున్నారు. రోజూలాగ నన్ను పిలవలేదు. సాధారణంగా ఇంటికివచ్చి రావడంతోటే రాత్రికి వంటలేం తయారు చేస్తున్నానో కనుక్కోవడం, ఇదలాగ చెయ్యి అదిలాగ చెయ్యి అని పురమాయించడం ఆయనకి అలవాటు. కాని ఇవాళ ఏమోకాని వచ్చింది మొదలు అదోలాగ విచారంగా కూచున్నారు.



నావల్ల ఏం పొరపాటో వచ్చివుండాలి. అందుకే కోపంగా వున్నారు అని నేననుకున్నాను. ఆయన వేసే ప్లీడరు ప్రశ్నలకి జవాబిద్దామంటే నాబుద్ధి బుర్రలో వుండకుండా ఎక్కడికో పారిపోతుంది కదా. ఇక నేనేం చెయ్యను. పోనీ నాతప్పు క్షమించండి, నావల్ల తప్పేఅంటే, వూరుకోరు కదా, ఏంతప్పని అడుగుతారు. నేనేంచెయ్యను?

ఆయన ప్రశ్నలకి మారు మాటాడకుండా వూరుకున్నాను. అంతకన్న గత్యంతరం ఏమీ తోచలేదు.

" ఏం మాటాడవేం "

నేను వులకలేదు, పలకలేదు.

" అలా మిడుతూ మిడుతూ చూస్తావేమిటి"

" ఊఁ... మరీ... "

" ఏమిటి తప్పు "

"..................."

" ఊఁ... చెప్పవేం... "

"..................."

" మంకులాగ అలా వూరుకుంటావేం "

నాకు కళ్లంట నీళ్లుతిరిగేయి. వస్తూన్న దుఃఖం మెల్లిగా కష్టపడి దిగమింగేను.

" అబద్ధమాడకుండా చెప్పు నీవల్ల తప్పేమిటో; మరి త్వరగాకానీ."

" కోంబడరు కదా "

" భయంలేదులే చెప్పు "

" ఊఁ ఊఁ "

"వేగం కానీ..."

"మరీ, నావల్ల ఏంతప్పున్నాదని నన్నా లాగ వూరికే అంటారు. నేనేం చెయ్యా లేదు"

"అయితే, నావల్లతప్పే అని ఎందు కన్నావు"

"మీరు చిర్రాగ్గా వున్నారు కదా అని, నామీద ఎందుకో కోపం వచ్చిందను కున్నాను..."

ఆయన మొఘంమీద చిరునవ్వు వెలి గింది. నా గుండెలో దడ దడ తొలిగింది.

"వెర్రిదానా, ఏదో ఆఫీసులో చికా కుతో నేనలాగా ఆలోచిస్తూ పడుకున్నాను. అంతే: కాని నీమీద కోపంతో కాదు. ప్రతీది నీమీద ఎందుకు పెట్టుకుంటావూ! ...నీవల్ల ఓ తప్పుంది"

"ఏమిటి" అన్నాను ఆతృతతో

"నే నింటికి రాగానే కాఫీయేనా ఇవ్వక పోవడం"

---

